సాక్షి చిత్తూరు

గురువారం ၊ 6 ၊ మార్చి ၊ 2025



ముగిసిన ఇంటర్వ్యూలు
చిత్తూరులో కార్పొరేషన్ రుణాల మంజూరుకు నిర్వహించిన ఇంటర్వ్యూలు బుధవారంతో ముగిశాయి.



తప్పుల సవరణకు ప్రత్యేక బృందాలు
ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాలో తప్పుల సవరణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



నాలుగు లారీల సీజ్
కుప్పం–మదనపల్లె రహదారిలో గ్రానైట్ అక్రమంగా తరలిస్తున్న 4 లారీలను రాళ్లబూదుగూరు పోలీసులు సీజ్ చేశారు.



న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఒకరి డిబార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఒక అభ్యర్థిని డిబార్ చేశారు. రాష్ట్ర కోఆర్డినేటర్ అక్బర్ బుధవారం జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిత్తూరులోని సంతపేట పరీక్ష కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక అభ్యర్థిని ఆయన డిబార్ చేశారు. అనంతరం పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఇన్విజిలేటర్, చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులపై చర్యలు తీసుకోవా లని విద్యాశాఖాధికారులకు సిఫార్సు చేశారు. జిల్లాలో ఈ నెల 5వ తేదీన నిర్వహించిన పరీక్షకు 2,747 మంది అభ్యర్థులకుగాను 2,302 మంది హాజరయ్యారు. మిగిలిన 444 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది 15 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారని డీఈఓ వరలక్ష్మి తెలిపారు.

అమ్మవారి సేవలో ఫుడ్ కమిషన్ చైర్మన్



ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ ఏకాంబరం

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయనకు ఈఓ తీర్థప్రసాదాలు అందజేయగా, వేదపండితులు ఆశీర్వచనం పలికారు.

వెబ్‌సైట్‌లో పది హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్: పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వాట్సాప్ మనమిత్ర నంబర్ 95523 00009లో కూడా హాల్‌టికెట్‌లు పొందే వెసులుబాటు కల్పించారన్నారు. అలాగే www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్‌టికెట్‌లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం తదితర వివరాలు తప్పుగా ఉంటే వెంటనే సంబంధిత హెచ్‌ఎంలు dir_govexams@yahoo.com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇతర వివరాలకు డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించవచ్చని ఆమె వెల్లడించారు.

డీవైఈఓ పరీక్షలు రాసే టీచర్లకు మినహాయింపు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో డీవైఈఓ మెయిన్స్ పరీక్షలు రాసే టీచర్లకు పదో తరగతి పరీక్షల విధుల మినహాయింపు కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జారీ చేసిన ఉత్తర్వులు బుధవారం డీఈఓ కార్యాలయానికి అందాయి. జిల్లాలో డీవైఈఓ మెయిన్ పరీక్ష రాసే టీచర్లకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధులు కేటాయించకూడదన్నారు. మార్చి 26, 27వ తేదీల్లో అర్హత గల వారికి సెలవు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 577 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 577 మంది గైర్హాజరయ్యారని డీవైఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 50 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 12196 మందికిగాను 11715 మంది హాజరుకాగా, 480 మంది గైర్హాజరయ్యారన్నారు. వొకేషనల్ విద్యార్థులు 1808 మందికి గాను 1711 మంది హాజరుకాగా 97 మంది గైర్హాజరైనట్లు డీవైఈఓ వెల్లడించారు.

మిత్రుడు అంటే హితం కోరే వాడు.. అలా రోగులకు ఆపదలో వెన్నంటే ఉండి వారికి కావాల్సిన సాయం అందిస్తూ, నీడలా ఉన్న వైద్యమిత్రలు సమాజానికి చాలా అవసరం. అయితే కూటమి సర్కారు వారి భవితను ప్రశ్నార్థకంగా మార్చే ఆలోచన చేస్తోంది. వారిలో అభద్రతా భావం రేకెత్తించే నిర్ణయాలు తీసుకుని, వారి మెడపై కత్తి వేలాడదీస్తోంది. దీంతో జిల్లాలోని వైద్యమిత్రల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో వారు నిరసనకు సిద్ధమవుతున్నారు.



ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు

ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు –	4
పీహెచ్‌సీ నెట్‌వర్క్ ఆస్పత్రులు –	47
సీహెచ్‌సీ నెట్‌వర్క్ ఆస్పత్రులు –	7
ప్రైవేటు ఆస్పత్రులు –	9
డెంటల్ క్లినిక్‌లు –	7

వైద్యమిత్రల మెడపై కత్తి

- ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించే కుట్ర
- సర్వీసుకు ఎసరు పెట్టేలా నిర్ణయం
- 15 ఏళ్లకు పైగా విధుల్లో ఉన్న ఉద్యోగులు
- ఆందోళనలో సిబ్బంది
- కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



ఆపదలో మిత్రులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం వైద్యమిత్రల మెడపై కత్తి పెట్టింది. సర్వీసుకు ఎసురు పెట్టేలా వ్యవహరిస్తోంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఆప్కాస్ ఏర్పాటు చేస్తే దానిని రద్దు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఏప్రిల్ నుంచి కొత్త విధానం అములులోకి రానుందనే ప్రచారం జోరందుకుంది. దీంతో వైద్య మిత్రలు అయోమయంలో పడ్డారు. మూడు సోమవారాలపాటు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టనున్నారు. జిల్లాలో 27 వైద్యశాలల్లో 48 మంది వైద్యమిత్రలు పని చేస్తున్నారు. వీరిలో 90 శాతం మంది 15 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్నారు. ఎక్కువ మంది డిగ్రీతో పాటు పీజీలు చేసిన వారున్నారు. వైద్యమిత్రలతోపాటు జిల్లాలో ఇద్దరు టీమ్ లీడర్లు, డీసీ ఒకరు, మానిటరింగ్ సిబ్బంది ఒకరు పనిచేస్తున్నారు. డీఎం, ఆఫీస్ అసోసియేట్ పోస్టులు ఖాళీలున్నాయి. వైద్య సేవకులను బీమా కంపెనీల చేతిలో పెడితే వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, సర్వీసు నష్టపోతామని వైద్య మిత్రలు వాపోతున్నారు.



ఆరోగ్యశ్రీ సేవలో సిబ్బంది (ఫైల్)

సీఎఫ్‌ఎంఎస్‌తో ఉద్యోగ భద్రత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ విభాగంలో పని చేసిన ఉద్యోగులను ఆప్కాస్ (ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్) కిందకు చేర్చారు. వారికి సీఎఫ్‌ఎంఎస్ ఐడీ ద్వారా ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు ఇచ్చారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించారు. సీఎఫ్‌ఎంఎస్ వేతనం తీసుకోవడంతో తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందన్న ఆశతో ఇన్నాళ్లుగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవను ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించే కుట్ర జరుగుతుండటంతో ఉద్యోగ భద్రతపై వైద్యమిత్రలు ఆందోళనకు గురవుతున్నారు.

ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న వారి వివరాలివీ..

జిల్లా కోఆర్డినేటర్ –	1
డీఈఓ –	1
టీమ్ లీడర్ –	2
ఆరోగ్యమిత్రలు –	48

ఏళ్ల తరబడి సేవ

రోగులు వైద్యశాలల్లో చేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకునే వరకు వైద్య మిత్రలు పర్యవేక్షిస్తుంటారు. పేద రోగులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ సేవలు అందిస్తుంటారు. వీరితో పాటు ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఆరోగ్య రక్ష స్కీమ్‌నకు సంబంధించి వివరాలు తెలియజేస్తుంటారు. ఇలా అన్ని విభాగాల్లో 15 ఏళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వయసు కూడా చాలా మందికి 50 ఏళ్లు దాటింది. ఆరోగ్యశ్రీ ప్రైవేటు చేతుల్లోకి వెళితే ఎవరిని ఉంచుతారో? ఎవరిని తొలగిస్తారోనని ఆందోళనగా ఉందని, ఈ వయసులో వేరే ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాలకు వెయిటేజ్ ఇవ్వాలని, చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గ్రాట్యూటీ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరసన

ఏపీ వైద్యమిత్ర ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు జిల్లాలోని వైద్య సేవకులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 10వతేదీ డీసీకి వినతిపత్రం ఇవ్వడం, 17న ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం, నల్లబ్యాడ్జీలతో డ్యూటీలకు హాజరుకావడం, 24న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వైద్యమిత్ర వర్గాలు చెబుతున్నాయి.

జీఓ 28 రద్దు చేయాలి



ఈ ఉద్యోగాన్ని నమ్ముకుని చాలా మంది కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అనేక ఒడిదుడుకుల మధ్య ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కంపెనీలో చేరుస్తారని చెబుతున్నారు. దీంతో చాలా మంది ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. ప్రభుత్వం వైద్యమిత్రలకు న్యాయం చేయాలి. ప్రధానంగా క్యాడర్ ఇవ్వాలి. జీతభత్యాలు పెంచాలి. 28 జీఓను రద్దు చేయాలి. కాంట్రాక్ట్‌లోకి తీసుకోవాలన్నదే తమ డిమాండ్.

– ఉషారాణి, జిల్లా నాయకురాలు, ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్

కులాంతరంపై కర్కశం

- పెద్దల సమక్షంలో పంచాయితీ
- జీర్ణించుకోలేని అమ్మాయి తండ్రి కత్తులతో దాడి
- గాయపడిన ప్రేమికులు.. అగరం కొత్తూరులో ఉద్రిక్తత



దాడిలో గాయపడిన చంద్రశేఖర్, కౌసల్య, సీతారామ్

కుప్పం: అల్లారుముద్దుగా పెంచిన ఒక్కగానొక్క కూతురు కులాంతర వివాహం చేసుకోవడాన్ని తండ్రి జీర్ణించుకోలేకపోయాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి, రాజీ కుదుర్చుతుండగా అమ్మాయి తండ్రి ప్రేమికులపై దాడి చేశాడు. దీంతో ప్రేమికులతో పాటు మధ్యవర్తులకూ గాయాలయ్యాయి. ఈ సంఘటన కుప్పం పట్టణం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుడుపల్లె మండలం అగరం కొత్తూరు గ్రామానికి చెందిన శివశంకర్, కోదండప్ప అనే వ్యక్తులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరు పక్కపక్క ఇళ్లలో నివసిస్తూ పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో కోదండప్ప కుమారుడు చంద్రశేఖర్, శివశంకర్ కుమార్తె కౌసల్య ఇరువురు గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కౌసల్య ఒక్కగానొక్క కూతురు కావడంతో శివశంకర్ కూతుర్ని గారాబంగా పెంచి డిగ్రీ చదివిస్తున్నాడు. కౌసల్య, చంద్రశేఖర్‌ల ప్రేమ విషయం పెద్దలకు తెలియడంతో శివశంకర్ తన కూతురు కౌసల్యను పలుమార్లు మందలించాడు. డిగ్రీ వరకు చదువుకున్న అమ్మాయిని వ్యవసాయ కూలీకి ఇచ్చి వివాహం చేయడం ఇష్టం లేదంటూ కూతురికి పలుసార్లు నచ్చజెప్పాడు. కానీ కౌసల్య ససేమిరా అనడంతో పాటు గత రెండు రోజుల క్రితం చంద్రశేఖర్‌తో పరారై తమిళనాడులోని ఓ దేవస్థానంలో ప్రేమ వివాహం చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న అగరం కొత్తూరు గ్రామస్తులు ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నంలో భాగంగా గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద పంచాయితీ ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న శివశంకర్ కత్తులతో ఒంటరిగా ఉన్న ప్రేమికులపై దాడి చేశాడు. ఈ దాడిలో కౌసల్య చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడికి అడ్డువచ్చిన గ్రామస్తులు రమేష్, సీతారామప్పలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వీరిని పక్కనే ఉన్న కుప్పం వంద పడకల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమీక్షలు నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ విషయంలో ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి ప్రాధాన్యత తాగునీటి సమస్య పరిష్కారానికి కేటాయించాలని చెప్పారు.

సమీక్ష నిర్వహిస్తే కానీ పనులు చేయరా?

సమీక్షలు నిర్వహిస్తే కానీ పనులు చేయరా? అని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఇది వరకే మండలాలకు అందిన నిధులతో కేటాయించిన పనులకు ఇప్పటివరకు నిధులు ఖర్చు చేయని ఎంపీడీఓలపై కలెక్టర్ మండిపడ్డారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులను ఖర్చు చేస్తే అందుకు సంబంధించిన మూడు దశల(బోరు, పంపు సెట్, నీటి సరఫరా)లో జియో ట్యాగింగ్ ఫొటోలను అప్లోడ్ చే యాలన్నారు.

ఉపాధి కల్పనకు శిక్షణ ఇవ్వండి

జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు రూ. 544 కోట్లతో 59,044 మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించామన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ కింద 29 జనవరి 2025 నుంచి 4 మార్చి 2025 వరకు 78 దరఖాస్తులు స్వీకరించగా 61 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాల నిర్వహణలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో ఇప్పటి వరకు 45,119 ఎంఎస్‌ఎంఈ యూనిట్లను సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఈ సర్వే ప్రక్రియను 15 మార్చి 2025 లోపు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, జీఎం ఇండస్ట్రీస్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్‌డీఎం హరీష్, డీపీఓ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధ్యమేనా..?

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆర్థిక సంవత్సరం చేరుకోవడం కలగా మారింది. నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడానికి రూ.83.64 కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. 25 రోజుల్లో అంత మొత్తం రావడం కష్టమేనని అధికారులు అంటున్నారు. ఇందులోనూ మంగళ, శుక్రవారాల్లో రిజిస్ట్రేషన్లు అంతంతమాత్రంగానే జరుగుతాయి. భూ విలువలు పెరగడంతో పెద్దగా డాక్యుమెంటేషన్లు జరగడం లేదని తెలుస్తోంది. 2024–2025 ఆర్థిక సంవత్సరం రూ.221 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఫిబ్రవరి వరకు రూ.197 కోట్లు ఆదాయం టార్గెట్‌గా పెట్టగా అందులో రూ.136 కోట్లు మాత్రమే వచ్చింది. మార్చి 4 వరకు రూ1.36 కోట్లు వసూలు అయ్యింది. ఆ లెక్కన ఇప్పటి వరకు మొత్తం రూ.137.36 కోట్లు రాగా ఇంకా 25 రోజుల్లో రూ.83.64 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇది కలలో కూడ సాధ్యం కాదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. మొత్తం 55 వేల డాక్యుమెంటేషన్లు జరగ్గా ఫిబ్రవరి వరకు 69 శాతం లక్ష్యం చేరుకున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఏవీఆర్ మూర్తి తెలిపారు.

సీఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయ కేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ విద్యాసంస్థ డైరెక్టర్లు, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఏ ఇంటర్, ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఏ ఇంటర్ కోర్సులో సాయిప్రమోద్ 321, మనోజ్ 320 మార్కులు సాధించారని, వీరితో పాటు 59.37శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే సీఏ ఫౌండేషన్ కోర్సులో ఎస్‌వి.నందిని, డి.పల్లవి, డి.మీన, పి.చందనప్రియ, కె.రిషతతో పాటు 68.76 శాతం మంది ఉతీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని వారు అభినందించారు.

8న ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈనెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో చెక్‌బౌన్స్, మోటారు వాహన కేసులు, డీవీసీ, బ్యాంకు, బీఎస్‌ఎన్‌ఎల్, చిట్ ఫండ్, బీమా, రెవెన్యూ, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. వివరాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్, చిత్తూరు కోర్టు భవనాల్లో ఉన్న లీగల్‌సెల్ భవనంలో సంప్రదించాలన్నారు.

తోటపాళ్యంలో అనుమానిత డెంగీ కేసు!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు తోటపాళ్యంలో బుధవారం అనుమానిత డెంగీ కేసు నమోదైంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తోటపాళ్యం ప్రాంతాన్ని సందర్శించారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. పారిశుద్ధ్య పనులు చేయించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది నారాయణ, మురళి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

బాసూ..! ఎస్‌ఐ ప్లీజ్..?



పెనుమూరు పోలీస్ స్టేషన్

చిత్తూరు అర్బన్: సుమారు 40 వేల మందికి పైగా జనాభా. 24 పంచాయతీలు. ప్రముఖ పుణ్యక్షేత్రం పులిగుండు ఉన్న ఊరు. అదే పెనుమూరు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ మాత్రం కనిపించడంలేదు. ఎనిమిది నెలలుగా ఈ స్టేషన్‌లో ఎస్‌ఐ పోస్టు భర్తీకి నోచుకోలేదు. మండలంలోని ఏ గ్రామంలో చిన్న సమస్య వచ్చినా ప్రజలు పెనుమూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం.. 'ఇక్కడ ఎస్‌ఐ లేరు, మీరు చిత్తూరు టౌన్‌లోని తాలూకా పోలీస్ స్టేషన్‌కు వెళ్లండి. అక్కడ సీఐ సార్ ఉంటారు. ఆయన మీ సమస్య చూస్తారు' అంటూ సిబ్బంది పంపివేయడం. నెలలు తరబడిగా ఇదే సమాధానం వినివిని మండలంలోని ప్రజలు విసుగెత్తిపోతున్నారు. పెనుమూరు మండల కేంద్రం నుంచి చిత్తూరుకు 22 కిలోమీటర్ల దూరం ఉంది. ఇక చుట్టు పక్కల గ్రామాల నుంచైతే 30 కిలోమీటర్ల పైనే దూరం. మనిషి కనిపించికపోయినా, ఇంట్లో చోరీ జరిగినా, చిన్నపాటి గొడవలు జరిగినా, ఆఖరుకు చింతచెట్లు కొట్టేసినా సరే.. పెనుమూరు ప్రజలు చిత్తూరుకు రావాల్సిందే. స్టేషన్‌లో ఇద్దరు ఏఎస్‌ఐలుంటే ఒకరు వారెంట్ డ్యూటీ, మరొకరు స్టేషన్ పర్యవేక్షణ బాధ్యత. ఉన్న పది మందిలో ఎవరికి వాళ్లే బాసు. ఒకరి మాట, ఒకరు వినే పరిస్థితి లేదు. అలాంటిది ప్రజల సమస్య ఏం వింటారనే విమర్శలున్నాయి. మరోవైపు కూటమి ప్రజాప్రతినిధి చెప్పిన వ్యక్తికి ఇక్కడ ఎస్‌ఐ పోస్టింగ్ దక్కడం లేదో..? పోలీసు బాసు ఎవరినైనా నియమిస్తే ఆయన్ని ఇక్కడ చేర్చుకోవడంలేదో..? తెలియడం లేదుగానీ.. ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడంలేదు. ఒక్కొక్కసారి తాలూక స్టేషన్‌లోని పోలీసు సారుకూ చిర్రెత్తుకొస్తుంది. జనం ముందే 'మీ ఊరికి ఓ ఎస్‌ఐను వేసుకోవడానికి వగలేదు. ఊరికే నా వద్దకు వస్తారు. మీ వల్లెత్తై ఎస్‌ఐను వేసుకోండి. నాకు ఇదొక్కటే స్టేషన్ కాదు కాదా..?' అంటూ చిర్రుబుర్రులాడుతున్నారని ప్రజలు నిట్టూరుస్తున్నారు. మరి పోలీసు 'బాసు' ఇప్పటికైనా పెనుమూరు స్టేషన్‌కు ఎస్‌ఐని నియమిస్తే ప్రజలకు మేలు చేసినట్లవుతుంది.

పుత్రశోకం

ప్రతి రోజు కళ్లముందు తిరుగుతున్న ఇద్దరు కుమారుల్లో ఒకరు కానరాని లోకాలకు వెళ్లి పోగా, మరొకరు మృత్యువుతో పోరాడుతూ ఆస్పత్రి పాలయ్యాడు. దీంతో ఆ తల్లిదండ్రులకు కలిగిన శోకం వర్ణనాతీతం.

- ట్రాక్టర్ రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు
- రోడ్డు ప్రమాదంలో ఒక కుమారుడి మృతి, మరో కుమారుడి పరిస్థితి విషమం



సంఘటన స్థలంలో రవిశేఖర్, మునికుమార్, మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నగరి/విజయపురం: పుత్తూరు– చెన్నై జాతీయ రహదారి పిళ్లారిపట్టు వందనవైన్స్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రవిశేఖర్ (19) అనే విద్యార్థి మృతి చెందగా మునికుమార్ (20) అనే మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. అన్నదమ్ములైన ఈ విద్యార్థులు కళాశాలకు వెళుతుండగా జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, ద్విచక్రవాహన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుత్తూరు మండలం గట్టు గ్రామానికి చెందిన మంజునాథ, లక్ష్మి దంపతులు వీధుల్లో కూరగాయలు అమ్మి జీవనం సాగిస్తున్నారు. వీరికి రవిశేఖర్, మునికుమార్ ఇద్దరు సంతానం. పెద్దవాడు మునికుమార్ పుత్తూరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం, రెండో కుమారుడు రవిశేఖర్ బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇంటి నుంచి కళాశాల దూరంగా ఉండడంతో వీరు రోజు ద్విచక్ర వాహనంలో కళాశాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం యథావిధిగా అన్నదమ్ములిద్దరూ ద్విచక్రవాహనంలో కళాశాలకు బయలుదేరారు. మార్గం మధ్యలోని పిళ్లారిపట్టు వందనవైన్స్ సమీపంలో ఓ ట్రాక్టర్ రాంగ్‌రూట్‌లో వచ్చి వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రవిశేఖర్ (19) అక్కడికక్కడే మరణించగా, మునికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. కళ్లముందు ఆడుతూ పాడుతూ తిరిగే కొడుకుల్లో ఒకరు మరణించగా, మరొకరు మృత్యువుతో పోరాడుతున్న ఆ ఘటన చూసి, ఆ తల్లిదండ్రులు పడుతున్న తపన, ఆవేదన అందరినీ కలిచివేసింది. గట్టు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.